# రైతన్నా.. భూసారం తెలుసుకో!

భూసార పరీక్షలతో భూమిలో పోషక విలువలను సమతుల్యంగా ఉంచుకోవచ్చు. అందుకే రైతులకు మేలు చేసేందుకు వ్యవసాయ శాఖ భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం మండల స్థాయిలో 460 నమూనాలను సేకరించే పనిలో వ్యవసాయశాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. సేకరించిన మట్టి నమూనాలను సాయిల్ టెస్టు సెంటర్‌కు పంపించనున్నారు. భూసార పరీక్షల ఫలితాల ద్వారా సారం కోల్పోయిన భూమిలో పోషక విలువల సమతుల్యత సాధించి అధిక దిగుబడులు పొందవచ్చు. ఈ కార్యక్రమాన్ని రైతు సద్వినియోగం చేసుకోవాలని పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు. – నింద్ర

- భూసార పరీక్షలతో లోపాల గుర్తింపు
- వినియోగించుకుంటే రైతులకు ఎంతో ఉపయోగం


అగరం గ్రామంలో మట్టి నమూనా సేకరణ

నీటి సౌకర్యం ఉన్న చోట బోర్లు, బావులు సాగునీటి కాలువల ద్వారా ఏడాది పొడవునా భూములు సాగు చేస్తుంటారు. అందుకే పొలాల్లో ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలి. ప్రతి మూడు సీజన్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించకోవడంతో రైతులకు మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. వర్షాధార భూములు, మెట్ట భూముల్లో మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. రైతులు పంటలు సాగు చేసిన ప్రతిసారి భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. భూసార పరీక్షల ద్వారా భూమిలో నీటి శాతం ఎంత వరకు తగ్గిందో తెలుసుకోవచ్చు. తద్వారా పంట సాగు చేసే ముందు తగిన మేరకు వీటిని పిచికారీ చేస్తే భూసారం మళ్లీ యథాస్థితికి చేరుకుని మంచి దిగుబడులు సాధించవచ్చు.

**సీజన్ ప్రారంభం అనుకూలం**

భూసార పరీక్షల కోసం భూమిలో మట్టి నమూనాలను సేకరించేందుకు ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభ సమయాలు చాలా అనుకూలంగా ఉంటాయి. ఏడాదిలో ఈ రెండు సీజన్ల ప్రారంభం సమయాల్లో చాలా వరకు పొలాల్లో పంటల సాగు ఉండదు. దీంతో బీడు భూములు అధికంగా ఉంటాయి. అప్పుడు మట్టి నమూనాలను సేకరిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయి.

**ఎనిమిది చోట్ల మట్టి సేకరణ**

భూసార పరీక్షల్లో భాగంగా ఒక పొలంలో ఎనిమిది చోట్ల మట్టి నమూనాలను సేకరిస్తారు. వర్షధార భూములైనా, నీటి సౌకర్యం ఉన్న భూములైనా మట్టి సేకరణ విధానం ఒకేలా ఉంటుంది. పొలం నలుమూలల ఎనిమిది చోట్ల 'వి' ఆకారంలో తవ్వి ఒక చోట అరకిలో చొప్పున మట్టి నమూనాలను సేకరిస్తారు. తరువాత మట్టి మొత్తాన్ని ఒకే చోట కలిపి భూసార పరీక్షలు చేస్తారు. తద్వారా పొలంలో పోషకాలు ఎంత మేరకు ఉన్నాయో తెలిసే అవకాశం ఉంటుంది.

**21 రోజుల్లో ఫలితాలు**

భూసార పరీక్షల నిమిత్తం సేకరించిన మట్టి నమూనాల ఫలితాలను 21 రోజుల తర్వాత ప్రకటిస్తారు. రైతు భరోసా కేంద్ర సిబ్బంది భూసార పరీక్షలకు ఫలితాన్ని సదరు రైతుకు తెలియజేస్తారు. దీంతో సదరు రైతు పొలంలో నత్రజని, పొటాష్, భాస్వరం, కాల్షియం, ఐరన్‌తోపాటు ఉదజని సూచిక, సేంద్రియ కర్బనం ఎంత మేరకు భూమిలో ఉన్నాయో తెలుస్తుంది. భూసారాన్ని పెంపొందించేందుకు ఎలాంటి పోషక విలువలు కలిగిన ఎరువులు వాడాలో వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తారు.

**పోషకాల సమతుల్యత**



పంటలు సాగు చేసే పొలాల్లో స్థూ, సూక్ష్మ పోషకాల సమతుల్యత భూసార పరీక్ష ద్వారా సరిచేసుకోవాల్సి ఉంటుంది. పొలాలను దుక్కులు చేసే సమయంలో, విత్తనాలు వేసే సమయంలో సూక్ష్మ పోషకాల మందులను వినియోగించాల్సి ఉంటుంది. అందుకోసం మా భూమిలో భూసార పరీక్షలు చేసుకున్నాం. లోపాలు గుర్తించాం. రైతులకు ఎంతో ఉపయోగకరం.

**- వరదరాజు, రైతు, ఓబులురాజు కండ్రిగ**

**భూసారం తెలుస్తుంది**



వ్యవసాయ శాఖ భూసార పరీక్షల ద్వారా మా పొలంలో ఉన్న లోపాలు గుర్తించి వాటి అనువుగా ఎరువులు వాడాలి. ఎలాంటి పంటలు వేసుకోవడం తెలుసుకున్నాం. దీంతో భూమిలో పంటలు కావాల్సినన పోషకాలు వాడుతున్నాం. సారవంతం, జింక్ లోపాలను గుర్తించాం. రైతులకు అన్నివిధాలుగా లాభదాయకం.

**- విశ్వనాథం, రైతు, అత్తూరు**

**భూమిని సారవంతంగా మార్చుకోవచ్చు**



భూసార పరీక్షలతో భూములను సారవంతంగా మార్చుకోవచ్చు. భూసార పరీక్ష ఫలితాల కార్డులను రైతులకు అందజేస్తాం. గుల్ల బారిపోయిన భూములను సారవంతంగా మార్చుకుని అధిక దిగుబడులు సాధించవచ్చు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరిస్తాం.

**-తులసీరాం, మండల వ్యవసాయాధికారి, నింద్ర**

## క్లుప్తంగా

### దుర్గాదేవి సేవలు అభినందనీయం


డాక్టర్ దుర్గాదేవి

గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ దుర్గాదేవి వైద్య సేవలు అభినందనీయమని వైద్యులు, వైద్య సిబ్బంది అన్నారు. గత నాలుగు సంవత్సరాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించి ప్రస్తుతం పీజీ గైన కాలజీ చదవడం కోసం చిత్తూరు అపోలో ఆసుపత్రికి వెళ్లనున్న నేపథ్యంలో జీడీ నెల్లూరు ఆసుపత్రి వైద్యులు వైద్య సిబ్బంది వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆమెను ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కేశవ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, రెడ్ క్రాస్ మండల చైర్మన్ పాపిరెడ్డి, వైద్య సిబ్బంది శ్రీని వాసులు, కృష్ణన్, ధర్మేంద్ర, శైల, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### పి–4 సర్వేలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న ఏఎస్ఓ నాగార్జున

కార్వేటినగరం: పీ–4 సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏఎస్ఓ నాగార్జున అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్ఓ మాట్లాడుతూ సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై క్షేత్రస్థాయిలో అమలయ్యే విధంగా చూడాలని సూచించారు. ప్రజల మధ్య ఉన్న ఆర్థిక అసమానతలను తొలగించి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశంతో పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్‌షిప్ కలసి ప్రారంభించిందే పీ–4 సర్వే అన్నారు. ఇందులో ప్రభుత్వం ఇచ్చిన లింక్ ద్వారా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి, వీఆర్ఓ బాలచంద్ర సింగ్, అధ్యాపకులు ధనుంజయరెడ్డి, హరిబాబు, సుబ్బారావు, జోగి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

### మాధవీలతకు డాక్టరేట్


మాధవీలత

గంగాధరనెల్లూరు: మండలంలోని బందార్లపల్లి గ్రామానికి చెందిన యతీష్ రాజు సతీమణి మాధవీలత శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో డాక్టరేట్ అందుకున్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో అనాలసిస్ ఆఫ్ ఎయిర్ పొల్యూషన్స్ డేటా యూజింగ్ డేటా మైనింగ్ టెక్నిక్స్ అనే అంశంపై ప్రొఫెసర్ సరోజమ్మ నేతృత్వంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా మాధవీలతకు ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు.

### ఇంటి పన్నులు చెల్లించాలి


ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

వెదురుకుప్పం: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇంటి పన్నులు చెల్లించాలని ఈఓపీఆర్డీ పురుషోత్తం అన్నారు. గురువారం వెదురుకుప్పం పంచాయతీలో ఇంటి పన్నులు వసూలు చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఇంటి పన్ను చెల్లించాలని సూచించారు. సక్రమంగా ఇంటి పన్ను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటునందించాలని తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీలలో ఇంటి పన్ను వసూళ్లు చేపట్టాలన్నారు. సచివాలయ సిబ్బంది సతీష్, దయాకర్ పాల్గొన్నారు.

### చిన్నారుల సామర్థ్యం పెంపొందించాలి


అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

కార్వేటినగరం: చిన్నారులలో శారీరక, మానసిక సామర్థ్యాలను పెంపొందించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శామిని, ఇందిరా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ బీ–పఢాయి బీ అనే అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ పిల్లల ఎదుగుల కోసం పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రతి ఒక్కరూ చిన్నారుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక చొరవ చూపించాలన్నారు. మూడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంజేరమ్మ గుడికి సర్వీస్ రోడ్డు వేయండి


చెన్నై–తిరుపతి జాతీయ రహదారి కనుమ వద్ద అంజేరమ్మ గుడి

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం, తిరుపతి–చెన్నై జాతీయ రహదారి అంజేరమ్మ కనుమ వద్ద వెలసిన శ్రీఅంజేరమ్మ గుడి ఉంది. 150 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ గుడికి మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి వందలాది మంది భక్తులు వస్తుంటారు. మంగళ, శుక్ర, ఆదివారాలు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకొంటారు. అయితే తిరుపతి వైపు నుంచి వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలంటే టోల్‌గేట్ నుంచి తడుకు ఆర్ఎస్ వరకు వెళ్లి అక్కడ యూటర్న్ తీసుకొని మళ్లీ టోల్‌గేట్ సమీపంలో ఉన్న గుడికి వద్దకు రావాలంటే ఆరు కిలో మీటర్లు చుట్టుకొని రావాల్సి ఉంది. వాహనదారులు గోల్‌గేట్ నుంచి రాంగ్‌రూట్‌లో రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు గురై భక్తులు మృత్యువాత పడుతున్నారు. 2023 జూన్ 11వ తేది తిరుపతి నుంచి వచ్చిన ఓ టెంపో రాంగ్ రూట్‌లో వెళ్లడతో ప్రమాదాలకు గురై ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, కొందరు తీవ్ర గాయాలు పాలయ్యారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా భక్తుల సౌకర్యార్థం టోల్‌గేట్ నుంచి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

## బాధ పడొద్దు.. అండగా ఉంటాం


సుబ్రమణ్యం సతీమణిని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: బాధ పడొద్దు.. అండగా ఉంటామని మాజీ ఎంపీటీసీ సభ్యుడు సుబ్రమణ్యం సతీమణికి రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి భరోసానిచ్చారు. గురువారం మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం మృతి చెందినట్లు సమాచారం అందుకున్న ఆయన గ్రామానికి వెళ్లి సుబ్రమణ్యం కుటుంబ సభ్యులను ఓదార్చారు. సుబ్రమణ్యం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ దివ్యగాంధీ, మాజీ సర్పంచ్ మునికృష్ణ, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్‌లు, అమీద్, ఏసుపాదం, నందగోపాల్, బాబూజీ, ప్రసాద్ ఉన్నారు.

### అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు


వెదురుకుప్పం: శిక్షణ ఇస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం వెదురుకుప్పం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులోభాగంగా పోషణ బి పఢాయి బీ కార్యక్రమంపై కార్వేటినరగం సీడీపీఓ పద్మసునంద ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎంఈఓ మహేశ్వర్ మాట్లాడుతూ 1975లో ఐసీడీఎస్ ఏర్పడినప్పటి నుంచి చోటు చేసుకుంటున్న మార్పులపై ప్రసంగించారు. ప్రీ స్కూల్ విద్యా విధానంలో ఏ విధమైన పురోగతి సాధన, ప్రీస్కూల్ పిల్లలకు నాణ్యమైన బోధనకు సంబంధించి శిక్షణ ఉంటాయన్నారు. మూడు రోజులపాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు భారతి, శకుంతల పాల్గొన్నారు.

## భాస్కర్‌రాజు సేవలు చిరస్మరణీయం


సంస్మరణ సభకు హాజరైన విశ్రాంత ఉద్యోగులు


మాట్లాడుతున్న తిరుపతి జిల్లా అధ్యక్షుడు శంకర్

పుత్తూరు: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల కోసం అహర్నిశలు శ్రమించిన బి.భాస్కర్‌రాజు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో భాస్కర్‌రాజు సంస్మరణ సభ నిర్వహించారు. తిరుపతి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ పుత్తూరులో సంఘం భవనం నిర్మాణానికి భాస్కర్‌రాజు చూపిన చొరవ అనితరసాధ్యమని కొనియాడారు. ఉపాధ్యాయుడిగా, ఎంఎల్ఓగా ఆయన సేవలు మరువలేమన్నారు. భాస్కర్‌రాజు మరణం విశ్రాంత ఉద్యోగులకు తీరని లోటని తెలిపారు. తొలుత ఆయన చిత్రపటానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాస్కర్‌రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### సమీర్‌శర్మ రైతు పక్షపాతి

గంగాధరనెల్లూరు: చిత్తూరు జైన్ ఫామ్ ఫ్రెష్ ఉపాధ్యక్షుడు సమీర్ శర్మ లేని లోటు ఎవరు తీర్చలేరని ఆయన రైతుల పక్షపాతి అని పలువురు పారిశ్రామిక వేత్తలు, రైతులు అన్నారు. జైన్ ఫామ్ ఫ్రెష్ ఉపాధ్యక్షుడు సమీర్ శర్మ జనవరిలో గుండె పోటుతో మరణించారు. ఈ సందర్భంగా చిత్తూరులోని సూర్య ప్రతాప్ కల్యాణ మండపంలో గురువారం ఆయన సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైన్ ఫార్మ్ ఫ్రెష్ ఎండీ అథాంగ జైన్, కంపెనీ హెడ్ రోహన్ షా పాల్గొన్నారు.

## పారదర్శకంగా వేలంపాట నిర్వహించాలి


దయాసాగర్‌రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): మండల కేంద్రంలోని బస్టాండులో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గదులను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మళ్లీ వేలం పాట నిర్వహించాలని వైఎస్‌ఆర్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్ రెడ్డి డిమాండ్ చేశారు. పెనుమూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్టాండులో ఉన్న పంచాయతీ స్థలాన్ని టీడీపీ నేతలు 30 ఏళ్లుగా ఆక్రమించుకున్నారని తెలిపారు. వైఎస్ ఆర్ సీపీ అధికారంలోకి రాగానే ఆక్రమణలను తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించామని పేర్కొన్నారు. ఆ గదులను బుధవారం నిర్వహించిన వేలం పాటలో కూటమి నాయకులు, అధికారులతో కుమ్మక్కై సొంతం చేసుకున్నారని మండిపడ్డారు. పెనుమూరులో రూ.10 వేల అద్దెకు కూడా గదులు దొరకడం లేదన్నారు. అయితే టీడీపీ నేతలు షాపింగ్ కాంప్లెక్స్ గదులను తక్కువ అద్దెతో దక్కించుకున్నారని తెలిపారు. అధికారులు స్పందించి తిరిగి వేలం పాట నిర్వహించాలన్నారు. మరలా వేలంపాట నిర్వహించాలని నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి యుంగధర్ పొన్న కూడా డిమాండ్ చేశారు.

## పన్నులు చెల్లించకుంటే చర్యలు తప్పవు


మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి: మొండిబకాయిదారులు పన్ను చెల్లించకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగియనున్నందున పురపాలక సంఘం పరిధిలోని ఇంటి పన్నులు, ఖాళీస్థలం పన్నులు, మంచినీటి కుళాయి చార్జీలను బకాయిదారులు వెంటనే చెల్లించాలన్నారు. మొండి బకాయిదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వారి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. లేకుంటే మున్సిపల్ చట్టాలను అనుసరించి కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్నులను మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లో లేదా పట్టణంలోని 17 వార్డు సచివాలయాల్లోగానీ చెల్లించవచ్చన్నారు. ఆదివారం, సెలవు దినాల్లో కూడా పన్ను చెల్లించవచ్చారు. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు.

## కానరాని ధాన్యం కొనుగోలు కేంద్రం


విజయపురంలో దళారులకు వరి అమ్ముకొంటున్న రైతు

విజయపురం: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం లేదంటున్నారు రైతులు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు నానా కష్టాలు పడుతున్నారు. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటను అధికారులు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఇంత వరకు ఎక్కడా అమలు కాలేదు. దీంతో రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారు. 80 కిలోల బస్తా ధాన్యానికి రూ.1450 చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రైతులకు కష్టాలే తప్పా...ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. జిల్లా అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

### ఉన్నతి, స్త్రీనిధిని మెరుగుచేయాలి


మాట్లాడుతున్న కల్పలతరెడ్డి

పాలసముద్రం: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు సత్వర రుణాలను అందిస్తూ లాభాల బాటలో నడుస్తున్న ఏకైక సహకార సంస్థ స్త్రీనిధి, ఉన్నతి అని ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి తెలిపారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో తమ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఏపీఎం కల్పలతరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మరిన్ని ఎక్కువ రుణాలు అందించేలా స్త్రీనిధి సంస్థను మెరుగు పరిచే బాధ్యత మహిళలపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్రలు శోభ, మంజుల, మురగయ్య, బాలయ్య పాల్గొన్నారు.

## చలో తిరుపతికి తరలిరండి


నిరసన తెలుపుతున్న ఎస్సీ నాయకులు

వడమాలపేట (విజయపురం): తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 23వ తేదీ నిర్వహించే చలో మాల–చలో తిరుపతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పూడి జయంత్ బాబు పిలుపునిచ్చాడు. గురువారం వడమాలపేట మండలం బస్టాండు ఆవరణలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రాజశేఖర్, కె.ప్రభాకర్, డి.వినోద్, సాయి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### బాలికల వసతి గృహంలో సీసీ కెమెరాల నిఘా


హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప

పాలసముద్రం: మండల కేంద్రం పాలసముద్రంలో బాలికల బీసీ హాస్టల్‌లో గురువారం ఎస్ఐ చిన్నరెడ్డప్ప రెండు సీసీ కెమెరాలను అమర్చామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ భద్రత చర్యల్లో భాగంగా ఈ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

### పక్కా గృహాలకు అదనపు ఆర్థిక సాయం


వెదురుకుప్పం: మండలంలో పక్కా గృహాల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం అందిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ పృథ్వీ అన్నారు. గురువారం వెదురుకుప్పంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గృహాలు నిర్మాణ దశలో ఉన్న ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పక్కా గృహానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. దీనికి అదనంగా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తున్నట్లు చెప్పారు. మండలంలో 289 మంది ఎస్సీలు, ఎస్టీలు 16, బీసీలు 66 మంది లబ్ధిదారులు ఉండగా మొత్తం 371 మందికి రూ.2.10 కోట్లు అదనపు సాయం కింద జమ అవుతుందన్నారు. మే నెలాఖరులోపు నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా కొత్తగా గృహాల మంజూరు కోసం ఆయా గ్రామ సచివాలయాల్లో ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రాల నకళ్లు సమర్పించి నమోదు చేసుకోవాలని సూచించారు. సొంత స్థలం ఉన్నవారు మాత్రమే నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు వెదురుకుప్పంలోని హౌసింగ్ కార్యాలయంలో పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు సిబ్బంది అందుబాటులో ఉంటారని లేదా 70939 31011, 89197 19844 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### లీకేజీ అరికట్టండి


ఇల్లత్తూరు వద్ద పైపులైన్ లీకేజీ

విజయపురం: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు చెబుతారు.. కానీ పాటించరు. ఇల్లత్తూరు కుశస్థలి నది నుంచి రాజీవ్ టెక్నాలజీ పథకం కింద తాగునీరు అందించే పైపులైన్ లీకేజ్ అయ్యి నీరంతా వృథాగా పోతున్నా అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో రోజుకి లక్షల లీటర్లు నీరు వృథాగా పోతోందని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పైపులైన్ లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

### మునీశ్వరునికి చందనాలంకారం



నగరి: పట్టణ పరిధి కళింమిట్ట వేల్‌నగర్‌లోని మునీశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు చందన అలంకారం చేయగా అందరినీ అమితంగా ఆకట్టుకుంది. పలువురు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకొని కర్పూర హారతులు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### గేట్‌లో సత్తా చాటిన సుజన



పుత్తూరు: పుత్తూరు పట్టణానికి చెందిన ఆలూరు సుజన ఆల్ ఇండియా గేట్ (గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్) పరీక్షా ఫలితాల్లో 881 ర్యాంకు సాధించి, సత్తా చాటింది. సెరికల్చర్ ఉద్యోగి అయిన ఆలూరు సుబ్రమణ్యం, పార్వతి దంపతుల కుమార్తె సుజన ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన తిరుపతిలో జరిగిన గేట్ పరీక్ష రాశారు. సుజన మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే గేట్ పరీక్షలకు హాజరై మంచి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. కలికిరిలోని జేఎన్‌టీయూ నుంచి 2020లో ఇంజినీరింగ్ డిగ్రీ పట్టా పొందినట్లు తెలిపారు.